

# మాటా మంతీ

## - సాయి పద్మ



# విజయం దశవిధాలు ..!!

నేను చాలాసార్లు ఆలోచిస్తూ ఉంటాను. విజయం అంటే ఏంటీ ?? అని .. విజయానికి వొక్కొక్కరు, వొక్కో నిర్వచనం ఇచ్చినా.. విజయం లేదా సక్సెస్ మీద ప్రపంచం, వాళ్ళ అభిప్రాయాలు, నడుస్తాయి అన్నది నిర్వివాదాంశం. విజయానికీ, అపజయానికీ మధ్య ఉన్న గీత చాలా చిన్నది. చాలా సార్లు ఏది విజయమో, ఏది అపజయమో అర్ధం కాదు కూడా. అలాంటప్పుడే, సక్సెస్ అనేపదం విచిత్రంగా తోస్తుంది. విజయం అంటే డబ్బు, అది ఇచ్చే లైఫ్ స్టైల్ అనేది మాత్రమే కొలమెట్టు అయిన సమాజాల్లో, సక్సెస్ అనేది మిగతా కొలమానాల్లో కొలవటం చాలా కష్టం.

ఇంకోటి కూడా ఎక్కువ వింటూ ఉంటాం.. విజయానికి మనం వదులుకోవాల్సినవి అంటే విజయానికి మనం చెల్లించే మూల్యం కూడా తక్కువేం కాదు. చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పేది “ నీ జీవితం అందరిలా కాదు, మామూలుగా జరగటం చాలా అరుదు, నువ్వు నువ్వుగా నిలబడాలంటే చదువు వొక్కటే ఆలంబన , దాన్ని గట్టిగా పట్టుకో” అనేది.. గట్టిగానే పట్టుకున్నాను. బాత్రూం లేని స్కూళ్ళల్లో, ఉన్నా నాచు పట్టిన ప్రభుత్వ స్కూళ్ళ వాతావరణంలో పడుతూ లేస్తూ, ముఖ్యంగా యూరిన్ కి వెళ్ళలేని కొన్ని సంవత్సరాలు, బయటకి వెళ్ళాలంటే కేవలం బ్రెడ్ తిని వెళ్ళిన రోజులు , అన్నీ చదువు కోసమే. ప్రతీ మందుకీ వొక సైడ్ ఎఫ్ఫెక్ట్ ఉంటుంది , నేను అంత హెల్త్ పట్టించుకోకుండా, ఉన్నందుకు నాకు దొరికిన సైడ్ ఎఫెక్ట్ , వొక ప్రొఫెషన్ ని సరిగ్గా చేయగలిగే హెల్త్ లేకపోవటం. నా విజయాల కంటే , అపజయాలే పెద్ద గ్రంథం అవుతాయి.

అక్కడినుండీ, నేను సోషల్ వర్క్ లో ఇంచుమించు పాతికేళ్ళు గడపటం వరకూ, ప్రతీది వొక అపజయంతోనే మొదలైంది. దసరా అంటే బొమ్మల కొలువు. ఇంచుమించు రెండు నెలల ముందు నుండీ , మా ఇంట్లో బొమ్మల కొలువు హడావిడి మొదలయ్యేది. ఎలా పెట్టాలి, ఏమేం కొత్తవి కొనాలి ఇలాంటివి. మొన్ననే మా ప్రాజెక్ట్ ఏరియాస్ కి వెళ్లి, మా పిల్లల్ని చూసి వచ్చాం. మా దగ్గర ఎప్పుడో హాస్టల్ లో చదువుకున్న, అమ్మాయి ఇప్పుడు ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్. తను వొక చేయి డిజేబుల్డ్. ఆ అమ్మాయి కూడా పిల్లల్ని కొంచం మోటివేట్ చేయటానికి వచ్చింది. తాను పడ్డ ఇబ్బందులు, బాధలు చెప్తూ ఉంటె.. ఇంకా మారని ఎన్నో విషయాలు గుర్తొచ్చి, దిగులేసింది.

వికలాంగులు, రైల్వే స్టేషన్ల లో ఇతరత్రా ఎదుర్కొనే బాధలు, అవమానాలు చెప్తోంది ఆ అమ్మాయి.. నేను వింటూ.. కుతూహలంగా అడిగాను “ ఈ చదువు మానేస్తే, ఇలా తిరగక్కరలేదు కదా , ఈ బాధలు, ముఖ్యంగా హేళన, పబ్లిక్ ప్లేసెస్ లో సెక్సువల్ అబ్యూజ్ ఇలాంటివి ఫేస్ చేయక్కరలేదు కదా ?? “ అని , దానికి ఆ అమ్మాయి చెప్పిన సమాధానం – “చదువే కదా మేడం అన్నిటికి ఆలంబన అని చెప్పేవారు, మీరు.. ఎదుర్కొంటున్నాను , వొక్కోసారి తెలివిగా, వొక్కోసారి చురుకుగా, అయినా నా వొక్కరి జీవితం కోసం మాత్రమే కాదు కదా.. మీలా చాలా చేయాలి ..!! “

నాకు విజయం అంటే అర్ధం అయింది. అందరికీ విజయ దశమి శుభాకాంక్షలు. ★★★